క్లుప్తంగా

పంచారామక్షేత్రం అన్నదాన పథకానికి విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని గునుపూడి పంచారామ క్షేత్రం ఆలయానికి ఓ దాత విరాళం అందించారు. రాజమహేంద్రవరం పట్టణానికి చెందిన కడలి దుర్గారత్నం ఆలయ నిత్యాన్నదాన పథకానికి సోమవారం రూ.50,116 విరాళంగా అందించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి సోమవారం తెలిపారు.

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు



కోపల్లెలో ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కాళ్ల: కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ పరిధిలో ఆక్రమణ తొలగింపు పనులను అధికారులు సమక్షంలో సోమవారం చేపట్టారు. పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా, వాంద్రం వైపు వెళ్లేందుకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమదారులకు నోటీసులు ఇవ్వడంతో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించారు. ఆర్ అండ్‌బీ పంచాయతీ ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆక్రమణల తొలగింపు పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



కొండేపూడిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

పాలకోడేరు: మహిళల కోసం రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని అవగాహన చేసుకుని ఆత్మస్థైర్యంతో జీవించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి అన్నారు. సోమవారం కొండేపూడిలో నిర్వహించిన మిషన్ శక్తి 100 డేస్‌లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి మహిళా చట్టాలు, బాల్య వివాహాలపై వివరించారు. పార్వతి మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని వివరించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జ్యోతి, అంగన్‌వాడీ వర్కర్లు వెంకటలక్ష్మి మహిళలు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు చేస్తే కఠిన శిక్షలు

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చేసినా, మహిళలను వేధించినా వారిపై దాడులు చేసినా చట్టరీత్యా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ హెచ్చరించారు. పెదగరువు అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం మిషన్ శక్తి పథకంపై మహిళలు, తల్లులు గర్భవతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సరళ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసిన వారిపైన, సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు ఉంటాయన్నారు. చిన్నవయస్సులో గర్భం దాల్చడం వల్ల తల్లి, బిడ్డకు ఆరోగ్య పరంగా అనర్థాలే జరుగుతాయన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది దుర్గ, మార్తమ్మ, గర్భిణులు, బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

హెపటైటిస్ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కాళ్ల ప్రభుత్వాసుపత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాళ్ల: హెపటైటిస్ సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు సరాబు సునీల్ చెప్పారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం కాళ్ల ప్రభుత్వాసుపత్రి వద్ద హెపటైటిస్ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు సునీల్ మాట్లాడుతూ ఈ వ్యాధి లివర్‌కు సంబంధించిందన్నారు. లివర్ వద్ద నొప్పి, కామెర్లు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ వ్యాధి రక్తం ద్వారా ఒకరి నుంచి ఒకరికి సోకే ప్రమాదం ఉందన్నారు. ఒకరికి వాడిన సిరెంజ్ మరొకరికి వాడకూడదన్నారు. ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా ప్రభుత్వం వ్యాక్సిన్ అందజేస్తుందని, ప్రజలందరూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

'మిషన్ శక్తి'తో మహిళా సాధికారత

- చట్టాలపై అవగాహనతో మహిళలకు మరింత రక్షణ
- మహిళలు, కిశోర బాలికలు, అంగన్‌వాడీల బలోపేతమే లక్ష్యం
- ఐసీడీఎస్ ద్వారా అక్టోబర్ వరకు ప్రత్యేక సదస్సులు



మిషన్ శక్తిపై మహిళల్లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



ఆకివీడు హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆకివీడు: మహిళా సాధికారిత, మహిళా రక్షణకు సహాయ పడే చట్టాలు అమలు జేస్తూ మహిళా సాధికారత సాధించే దిశగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మిషన్ శక్తి కార్యక్రమాన్ని రూపొందించింది. 100 రోజుల పాటు ప్రణాళికాబద్ధంగా నిర్వహించే కార్యక్రమాల్ని ప్రకటించింది. గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకునేలా ఈ మిషన్‌శక్తి దోహదపడుతుంది. వంద రోజుల సుదీర్ఘ అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రతి మహిళకు మిషన్ శక్తి సామర్థ్యాల్ని, చట్టాల్ని, మహిళా రక్షణ, బాలికల భద్రత, గౌరవాన్ని నిర్ధారించడంపై ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడనుంది. ఆడది అంటే అబల కాదు సబల అనే విధంగా దేశంలో మహిళా శక్తిని తిరుగులేని శక్తిగా తయారుచేయనున్నారు. అర్ధరాత్రి అయినా మహిళ ఒంటరిగా తిరిగే రోజులు వచ్చినప్పుడే దేశానికి పూర్తి స్వాంత్రత్యం వచ్చినట్లని గాంధీజీ అన్న విధంగా మిషన్ శక్తి పథకానికి రూపకల్పన చేశారు.

ప్రత్యేక కమిటీలు ఏర్పాటు

గ్రామ, పట్టణ, మండల స్థాయిలో మహిళా రక్షణ కోసం నలుగురు సభ్యులతో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని సచివాలయ పరిధిలో 68, మండల స్థాయిలో 23 కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక కమిటీలో సీనియర్ మహిళా అధికారిణి, న్యాయవాదితో పాటు మరో సీనియర్ అధికారి సభ్యులుగా ఉంటారు.

విస్తృత స్థాయిలో సదస్సులు

నియోజకవర్గంలోని విస్తృత స్థాయిలో గ్రామాల్లో, పాఠశాలల్లో మహిళా, కిశోర బాలికలతో అవగాహనా కార్యక్రమాలి నిర్వహిస్తున్నారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకూ 7 వారాల పాటు అవగాహనా సదస్సులు నిర్వహించారు. మరో 63 సదస్సుల్ని అక్టోబర్ నెల లోపు పూర్తి చేయాల్సి ఉంది.

మహిళల్లో చైతన్యం పెరుగుతోంది



మిషన్ శక్తి మహిళల్లో ధైర్యాన్ని నింపుతోంది. కిషోర బాలికల రక్షణకు దోహదపడుతోంది. ప్రత్యేక కార్యక్రమాలు, అవగాహనా సదస్సులతో మహిళలు, బాలికల్లో చైతన్యాన్ని నింపుతున్నాం. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించకుండా ప్రాజెక్టు పరిధిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు పర్యవేక్షిస్తాయి.

– వి.వాణీ విజయరత్నం, ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు అధికారిణి, ఆకివీడు

పాఠశాలల్లో ఉత్సాహంగా 'శుభదిన్ భోజన్'



విద్యార్థులకు స్టీల్‌ప్లేట్స్, స్వీట్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం



అజ్జమూరు గరువులో సహపంక్తి భోజనం చేస్తున్న దృశ్యం



సమగ్ర శిక్షా సప్తాహ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని మహాత్మాగాంధీ మునిసిపల్ స్కూల్లోని విద్యార్థులకు 160 స్టీల్‌ప్లేట్లు, స్టీల్ స్టాండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవత సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు, డైరెక్టర్ ఇందుకూరి ప్రసాద్‌రాజు మాట్లాడుతూ శుభదిన్ భోజన్ కార్యక్రమం నిర్వహణకు దాతలు సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజీఆర్‌కే రాజు, దీప్తి రాజు, గ్రంధి కుమారవెంకటేశ్వర వరప్రసాద్, ఎల్‌ఎఫ్‌ఏ ప్రధానోపాధ్యాయుడు షేక్ బాబాజీ సాహెబ్, ఎండీ అల్లావుద్దీన్ నౌషాద్, మాగాపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అరసవల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐదు మునిసిపల్ పాఠశాలల్లో శిక్షాసప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు భోజనాలు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ, మావుళ్లు, సాయికుమార్ పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనే ధ్యేయం

ఆకివీడు: శిక్షా సప్తాహ ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని అజ్జమూరు గరువు ఎంపీపీ పాఠశాలలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చెలంకూరి చలపతిరావు మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు అన్ని కులాలు, మతాల ప్రజలు పాటుపడాలన్నారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా జీవించాలన్నారు. సామాజిక భాగస్వామ్యంతోనే శాంతియుత వాతావరణం ఏర్పడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామ పెద్దలు చందన చిన్నా, గోపిశెట్టి సత్యనారాయణ, ఇంటి సుకుమార్, కౌన్సిలర్ గోపిశెట్టి సత్యవతి, ప్రధానోపాధ్యాయుడు ఆర్వీ.నారాయణ(విక్రమ్), పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. విద్యార్థులు, హాజరైన వారికి స్వీట్లు, భోజన వసతిని సుకుమార్, చలపతిరావు సమకూర్చారు.

వీరవాసరం: సమగ్ర శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మండల పరిషత్ స్కూళ్లలో విద్యార్థులకు సహపంక్తి భోజనాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకంతో పాటు దాతల సహకారంతో స్వీట్స్, ఫ్రూట్స్, వంటకాలతో విద్యార్థులకు భోజనాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులంతా చక్కటి పౌష్టికాహారాన్ని స్వీకరిస్తూ విద్యాభివృద్ధి సాధించాలని వక్తలు కోరారు. వీరవాసరం, రాయకుదురు, అండలూరు, కొణితివాడ, మత్స్యపురి పాఠశాలలను, మండల పరిషత్ పాఠశాలలోనూ ప్రత్యేక భోజనం ఏర్పాట్లు చేయడంతో ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎంఈఓ శివన్నారాయణ, గడ్డం భారతి, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కడలి నెహ్రూ, కానుకొలను శ్రీనివాస్, గడ్డం భాస్కరరావు పాల్గొన్నారు.

పింఛను ఉద్యోగుల ప్రాథమిక హక్కు



భీమవరంలో నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన దృశ్యం

భీమవరం: పింఛను అనేది ఉద్యోగి ప్రాథమిక హక్కు అని భీమవరం సబ్‌ట్రెజరీ అధికారి రవి వర్మ అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్ నకారా వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పింఛను సాధించడానికి న్యాయపోరాటం చేసిన డీఎస్ నకారాను రిటైర్డ్ ఉద్యోగులంతా జీవితాంతం గుర్తు పెట్టుకుంటారన్నారు. పదవీ విరమణ అనంతరం వృద్ధాప్య జీవితాన్ని స్వతంత్రంగా జీవించడానికి చెల్లింపుగా పింఛనును పరిగణించాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.జేమ్స్ మాట్లాడుతూ 2004 అనంతరం పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా పింఛను సౌకర్యం కలిపించాలన్నారు. ముందుగా నకారా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి పి.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కరరావు, సత్యనారాయణ, చంద్రరావు, ముత్యాలరావు, కోటేశ్వరరావు, సత్యనారాయణరాజు, ఆర్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీతోనే ఉద్యోగావకాశాలు



ఎస్‌ఆర్‌కేఆర్ కళాశాల కార్యక్రమంలో మాట్లాడుతున్న పృథ్వితేజ

భీమవరం: నూతన టెక్నాలజీ అధ్యయనంతోనే ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోగలరని బోధ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ పృథ్వితేజ అన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులపాటు నిర్వహించే కాంపిటీటివ్ కోడింగ్ అనే అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏదైనా సమస్యను వేగంగా, సమర్థవంతంగా తక్కువ సమయంలోనే పరిష్కరించగల నైపుణ్యం ఉన్న వారినే ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటున్నారన్నారు. కాంపిటీటివ్ కోడింగ్‌లో నూతన అంశాన్ని సవాలుగా తీసుకుని తక్కువ సమయంలో పరిష్కరించవచ్చని పృథ్వితేజ అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో డిగ్రీతో పాటు నూతన టెక్నాలజీని కూడా అధ్యయనం చేసి ఆత్మవిశ్వాసంతో బయటికి వెళితేనే పోటీ ప్రపంచంలో రాణిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ హెడ్ వి.చంద్రశేఖర్, ఏఐఎంఎల్ కో–ఆర్డినేటర్ జీఎస్‌వీజీ శిరీష, ఏఎల్ లావణ్య, పి.సరోజ, జీవన సుజిత, జానకి దేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి



ఎస్సైకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఆకివీడు: మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని ఐద్వా మండల కమిటీ నాయకులు సోమవారం ఎస్సై బి.నాగబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ అధ్యక్షురాలు డోకల లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని నియంత్రించడానికి కఠినమైన చట్టాలు అమలుజేయాలని కోరారు. ఇటీవల పోక్సో కేసులు అధిక మవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవాలని కోరారు. ఆకివీడు ప్రాంతంలో గంజాయి విక్రయాలు పెరిగిపోయాయని వాటిని అదుపు చేసేందుకు పోలీసులు తనిఖీలు విస్తృతంగా చేయాలని కోరారు. ఎస్సై నాగబాబు మాట్లాడుతూ అల్లరి మూకల్ని అదుపు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. మహిళలకు అవగాహనా సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు జీవీ.లావణ్య, జీ.రాణి, బీ.కల్యాణి, పీ.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్డు, నిమ్మరసంతో మొక్కల ఎదుగుదల



కోడిగుడ్డు నిమ్మరసం ద్రావణంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: కోడిగుడ్డు నిమ్మరసం మొక్కల ఎదుగుదలకు దోహదం చేస్తుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా కో–ఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. నౌడూరులో కోడిగుడ్డు నిమ్మరసం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోడిగుడ్డు నిమ్మరసం తయారుచేసి ఎస్ హెచ్‌జి మహిళలకు, రైతులకు వివరించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ కోడిగుడ్లు, నిమ్మరసం ద్రావణం మొక్క ఆరోగ్యంగా పెరుగుటకు కావలసిన ప్రోటీన్లను అందిస్తుంది. ఈ ద్రావణాన్ని పంటలలో పిచికారీ చేయడం వలన పంటల నాణ్యత పెరుగుతుంది అని చెప్పారు. పండ్ల తోటలలో ఉపయోగించడం వలన పండ్ల నాణ్యత పెరుగుతుంది అని, పూత, పిందె నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి పి.దేవి నాగరాజు, పి.సర్వేశ్వరరావు, కే నాగరాజు, జి నవీన్ కుమార్, బి శ్రీనివాసరావు, మురళి కుమారి, టి సతీష్ కుమారి, బి వరలక్ష్మి, కే అంబేద్కర్ ఎస్ ఎస్ జి మహిళలు, రైతులు పాల్గొన్నారు.

మురుగు సమస్య సరే.. రోడ్డు తవ్వి వదిలేశారే



వేండ్ర రెండో వార్డులో రోడ్డును తవ్వి వదిలివేసిన దృశ్యం

పాలకోడేరు: అనేక ఫిర్యాదుల తరువాత స్పందించి మురుగు సమస్యను పరిష్కరించిన అధికారులు ఈ సమస్య పరిష్కారం కోసం తవ్విన రోడ్డును అలాగే వదిలివేశారు. వివరాల్లోకి వెళితే, వేండ్ర గ్రామంలో రెండో వార్డులో డ్రెయినేజీ పూడిపోయి మురుగు నీరు పారక రోడ్డును ముంచెత్తడంతో స్థానికులు ఈ సమస్యను గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేయగా, ఇటీవల స్పందించి రోడ్డును తవ్వి డ్రెయిన్‌లో పూడిక తొలగించి తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేపట్టకుండా అలాగే వదిలివేశారు. మురుగు సమస్య పరిష్కారమైందని ఆనందంలో ఉన్న స్థానికులు రోడ్డును తవ్వి వదిలివేయడంతో ఆ రోడ్డులో రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. డ్రెయిన్‌ను దాటి వెళ్లలేక చుట్టూ తిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. డ్రెయినేజీని దాటి వెళ్లేందుకు మహిళలు, పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఒక సమస్య పరిష్కరించి మరో సమస్యను సృష్టిస్తున్న అధికారుల తీరుతో ఎపుడూ మా బాధలు ఇంతేనా స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలి

భీమవరం: భీమవరం–కుముదవల్లి రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో మంచినీటి పైప్ లీకేజీని అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిన్నారని సీపీఎం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, అన్నం రాంబాబు విమర్శించారు. సోమవారం పార్టీ నాయకులు ఆ ప్రాంతంలో పర్యటించి పైప్ లీకేజీని పరిశీలించారు. నెల రోజులుగా పైప్‌లైన్ లీకై మంచినీరు రోడ్డు మీదకు వృధాగా పోతుండటమే కాక, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రెయినేజీ నీటితో కలిసిపోవడంతో వల్ల నీరు కలుషితమై దుర్వాసన వస్తోందని, ఈ నీరు తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని వెంకటేశ్వరరావు, రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ నివాసం ఉంటున్న ప్రాంతంలోనే పైప్ లీకేజీలను అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్ లీకేజీలను అరికట్టి ప్రజలకు పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు.

వరద బాధితులకు నిత్యావసరాల అందజేత



ఎన్నార్పీ అగ్రహారంలో వరద బాధితులకు సహాయం అందిస్తున్న దృశ్యం

ఉండి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముంపుబారిన పడిన కుటుంబాలకు సోమవారం ఎన్నార్పీ అగ్రహారంలో ప్రభుత్వ సాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన రెండు కుటుంబాల వారికి 25 కేజీల బియ్యం, కేజీ చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, కందిపప్పు, పామాయిల్ బాధితులకు అందజేశారు. పూర్తిగా ముంపునకు గురైన బాధితులకు మాత్రమే ప్రభుత్వం రూ.3 వేల చొప్పున అందిస్తుందని, తాత్కాలికంగా ముంపుబారిన పడిన వారికి నిత్యావసరాలు అందజేస్తున్నామని గ్రామ వీఆర్వో తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, ఎంపీటీసీ మున్నలూరు సువర్ణలక్ష్మి, చుక్కా రవిరాజు, వీఆర్వో గోవింద్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ద్వారా పంపిణీ

మండలంలో మొత్తం 56 మంది ముంపుబారిన పడ్డారని, వీరిలో ఎన్నార్పీ అగ్రహారంలో ఇద్దరు, యండగండిలో అధికంగా 54 కుటుంబాలు ఉన్నాయని తహసీల్దార్ కె.శ్రీనివాస్ చెప్పారు. వీరికి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘు రామకృష్ణంరాజు నిత్యావసరాలు, నగదు అందజేస్తారని ఆయన తెలిపారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఆకివీడు: రైల్వే గూడ్స్ కార్మికుల, ఇతర జట్టు కార్మికుల, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల్ని కాలరాస్తున్న కేంద్రంలోని ఎన్‌డీఏ కూటమికి గుణపాఠం చెప్పాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. ఆకివీడు రైల్వేస్టేషన్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించి రైల్వే గూడ్స్ అధికారి నందేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. లేబర్ కోడ్‌తో ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోందన్నారు. సీపీఎం మండల కమిటీ అధ్యక్షులు పెంకి అప్పారావు, కార్మికుల పాల్గొన్నారు.

రొయ్య రైతులను ఆదుకోవాలి

వీరవాసరం: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో ప్రకటించిన ఆక్వా పరిశ్రమకు టాక్స్ తగ్గింపు అమలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రాన్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్ల రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం వీరవాసరంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం బడ్జెట్లో ప్రకటించిన ప్రకారం చూస్తే రొయ్య మేతల ధర కిలో రూ.80 నుంచి రూ.90 తగ్గాలని వివరించారు. ఆ మేరకు తగ్గదలను వెంటనే అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయిన రొయ్యల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జై భారత్ క్షీరారామ ఆక్వా ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రొయ్య సంక్షేమ సంఘాలతో కలిసి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సువార్త సభలు

ఉండి: ఉండి చిక్కాల వీరన్న నగర్‌లోని బ్యూలా ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో దైవ ఆశీర్వాద సువార్త సభలు ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పాస్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. చర్చి ఆవరణలో ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు ప్రారంభించే ఈ సభలకు వాక్యోపదేశకులుగా జాన్‌మంగాచార్యులు (పెదలంక), రెవరెండ్ పంతో షరెడ్డి (రాజమండ్రి) నుంచి వస్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో విశ్వాసులు ఈ సభలకు హాజరుకావాలని కోరారు.

ఉండి తహసీల్దార్ బదిలీ

ఉండి: ఉండి తహసీల్దార్ కె.శ్రీనివాస్ బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీపై వచ్చిన తహసీల్దార్లను జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు చేపట్టిన బదిలీల్లో భాగంగా తహసీల్దార్‌ను ఏలూరు కలెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అలాగే మండలానికి కొత్త తహసీల్దార్ నియామకం జరిగే వరకు ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్వీఎస్ నాయుడుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉండి: ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర సోమవారం తెలిపారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

వీధి కుక్కలను చంపిన ఇద్దరిపై కేసు

భీమవరం: పట్టణంలోని నర్సయ్య అగ్రహారంలో వీధి కుక్కలను చంపారంటూ ఆ ప్రాంతానికి చెందిన శృంగవృక్షం ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. నర్సయ్య అగ్రహారంలో సోమవారం మూడు వీధి కుక్కలను అన్యాయంగా ఇద్దరు వ్యక్తులు చంపారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

ఆకివీడు: మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా కారు ఢీకొనడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన సత్యన్నారాయణరాజు, అతని భార్య సోమవారం స్థానిక వెంకయ్య వయ్యేరు వంతెన సమీపంలో మోటారు సైకిల్‌పై వెళుతుండగా, వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో మోటారు సైకిల్‌పై ఉన్న సత్యన్నారాయణరాజు, అతని భార్యకు గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు చెప్పారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

ఉండి: అర్తమూరులోని దళితపేటలో డ్రెయినేజ్ వ్యవస్థ లేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు ఆవేదన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ బృందం సోమవారం అర్తమూరు దళితపేటలో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. పారిశుధ్యం దారుణంగా ఉందని, డ్రెయిన్లలో ప్రవాహం లేదని, రోడ్లు ముంపు బారిన పడి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. విజయకుమార్, మాదాసి గోపీ, చిట్టిబాబు పాల్గొన్నారు.